నేటి దినపత్రిక
# సూర్య
కర్నూలు | నంద్యాల
మంగళవారం | 31 అక్టోబర్ 2023 | పేజీలు 8

వలసలు వెళ్లే ప్రాంతాల్లో
# పనులు కల్పించండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**
వలసలు వెళ్లే ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించి వలసల నివారణ తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలసల నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ కింద ప్రస్తుతం మిగతా 2లో

**కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన**

# పొత్తుల ఎత్తులు

- ఖాయమైన తెదేపా-జనసేన పొత్తు
- భాజపా కలిసి రావడంపై కొరవడిన స్పష్టత
- తెదేపా-జనసేనతో కలిసి నడుస్తున్న సిపిఐ
- తేలని సిపిఎం వైఖరి
- పొత్తులతో త్యాగాలు చేయాల్సిందెవరన్న ప్రశ్నలు
- ఉమ్మడి కర్నూలు జిల్లా తెదేపాలో ఎడతెగని చర్చ
- భాజపా దూరమైతే కలిసొచ్చే జనసేన, సిపిఐ, సిపిఎంలు డిమాండ్ చేసే స్థానాలేమిటి?



**ఎన్.వెంకటసుబ్బయ్య, మేజర్‌న్యూస్‌బ్యూరో**

రాబోయే ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. సాధారణ ఎన్నికలను అటు అధికారపక్షం, ఇటు ప్రతిపక్షం కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ప్రతిపక్ష తెదేపా సైతం ఎన్నికల శంఖారావాన్ని పూరించినా అధినేత చంద్రబాబు అరెస్టుతో కోలుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రాజెక్టుల సందర్శన, భవిష్యత్తుకు భరోసా అంటూ చంద్రబాబు రాష్ట్రవ్యాప్త పర్యటన ప్రారంభించగా, నారా లోకేష్ యువగళం పాదయాత్రలు అధినేత అరెస్టుతో ఆగిపోయాయి. చంద్రబాబు అరెస్టు తర్వాత అనేక రకాల ఆందోళనలు జరుగుతున్నా పార్టీ మైలేజ్‌ను అవి పెంచలేకపోతున్నాయని తెలుగుతమ్ముళ్లు వాపోతున్నారు. రాజమండ్రి జైలులో ఉంటున్న నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లోగా విడుదలవుతారా? లేదా? అన్న ప్రశ్నకు సమాధానం కోసం తెదేపా కిందిస్థాయి కార్యకర్తలు చెవులు రిక్కించుకుని చూస్తున్నారు. చంద్రబాబు అరెస్టుతో గుండెపగిలి చనిపోయిన, ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలను పరామర్శించే పేరుతో ఆయన సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో జనంలోకి రావడంతో తెదేపా శ్రేణులు ఊపిరి తీసుకుంటున్నాయి. ఇదే సమయంలో రాబోయే ఎన్నికల్లో తెదేపా ఎన్ని పార్టీలతో పొత్తులు కుదుర్చుకుంటుంది? ఎన్ని నియోజకవర్గాలు వారికి కేటాయిస్తారు? ఎంత మంది త్యాగాలు చేయాల్సి రావచ్చు? లాంటి ప్రశ్నలు ఇప్పుడు పై స్థాయి నేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తులు దాదాపు ఖరారైనట్లే. ఇప్పటికే రెండు పార్టీల సమన్వయ సమావేశాలు జరుగుతుండగా, నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అలాంటి సమావేశం జరగబోతోంది. ఎన్‌డిఏలో కొనసాగుతూ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెదేపాతో పొత్తులతో వెళుతున్న జనసేన ఎన్నికల సమయానికి భాజపా కూడా కలిసి వస్తుందన్న నమ్మకంతో ఉన్నట్లు కనిపిస్తోంది. తెలంగాణాలో ఆ పార్టీ భాజపాతో పొత్తులతో పోటీ చేస్తున్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. మరోవైపు ఇప్పటికే సిపిఐ తెదేపాతో కలసి అడుగులు వేస్తోంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చాలా కాలంగా అధికార వైసీపీపై నిప్పులు వెదజల్లుతూ తెదేపాకు అనుకూలంగా వెళుతున్న విషయం బహిరంగం. అలాగే సిపిఎం కూడా ఏపిలో తెదేపాతో కలిసి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెదేపా-జనసేన భాజపాతో వెళితే ఉభయ కమ్యూనిస్టులు కలిసి వస్తాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకమే. తెలంగాణాలో భార సాతో అంటకాగిన ఉభయకమ్యూనిస్టులను ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఎన్నికల సమయానికి దూరంగా ఉంచారు. మరి ఇక్కడ కూడా తెదేపా-జనసేన భాజపాతో కలిసి వెళ్లి మిగతా 2లో

శ్రీగిరిపై నవంబరు 14 నుండి
# కార్తీక మాసోత్సవాలు

- అన్ని విభాగాల అధికారులతో ఈవో పెద్దిరాజు సన్నాహక సమావేశం



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:**
శ్రీశైల మహా క్షేత్రంలో నవంబరు 14 నుండి డిసెంబరు 12 వరకు కార్తికమాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సోమవారం పరిపాలన భవనంలో ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపక (స్థానాచార్యులు) అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ కార్తికమాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మిగతా 2లో



- రాష్ట్రాభివృద్ధి- సమస్యలు అధ్యయనానికి బస్సుయాత్ర
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌దావలే..
- నవంబర్ 15న విజయవాడలో ప్రజాప్రణాళిక విడుదల
- బుగ్గన ఆర్థిక మంత్రి కాదు.. అప్పుల మంత్రి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్

అదాని... అంబానీలకు
# తొత్తుగా బిజెపి పాలన

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**
కేంద్రంలోని బిజెపి పాలన అదానీ అంబానీలకు తొత్తులుగా మారి పని చేస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ దావలే విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులు, మిగతా 6లో


మాట్లాడుతున్న అశోక్ దావలే

ఈవీఎంలను ప్రథమస్థాయిలో తనిఖీ చేసిన
# కేంద్ర పరిశీలకులు లలిత్‌మిట్టల్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**
ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమస్థాయి పరిశీలనను కేంద్ర ఎన్నికల పరిశీలకులు లలిత్ మిట్టల్ ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఈవీఎంల భద్రత గోడౌన్‌లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమస్థాయి పరిశీలనను కేంద్ర ఎన్నికల పరిశీలకులు లలిత్‌మిట్టల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లకు సంబంధించి ప్రథమస్థాయి పరిశీలన కార్యక్రమం బెల్ ఇంజనీర్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది మిగతా 2లో


రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న లలిత్‌మిట్టల్

సూర్య

మంగళవారం | 31 అక్టోబర్ 2023

# పొత్తుల ఎత్తులు

(మొదటిపేజీ తరువాయి)

ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు షాక్ ఇస్తాయా? చూడాలి. ప్రతిపక్ష పార్టీల రాజకీయ చదరంగం అంతా గందరగోళంగా కనిపిస్తోంది. అయినా, 2024 ఎన్నికల్లో ఆయా పార్టీలతో పొత్తులు కుదిరితే నష్టపోయే తెదేపా ఆశావహులు ఎవరన్న ప్రశ్న అందరినీ కుదిపేస్తోంది. ఇప్పటికే తెదేపా–జనసేన పొత్తులు ఖాయమైన నేపథ్యంలోఉమ్మడి కర్నూలు జిల్లాలో జనసేన ఎన్ని స్థానాలు కోరకునే అవకాశం ఉందన్న దానిపై తెదేపాలో చర్చలు ప్రారంభమయ్యాయి. కాపులు ఎక్కువగా ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, ఆదోని నియోజకవర్గాలను జనసేన డిమాండ్ చేస్తుందని భావిస్తున్నారు. అయితే,



చంద్రబాబునాయుడు

జనసేన ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలపై ప్రధాన దృష్టి కేంద్రీకరిస్తున్నందున ఉమ్మడి కర్నూలులో జిల్లాలో ఒకే ఒక్క సీటు కోరుకోవచ్చని అంటున్నారు. అది ఆళ్లగడ్డనా, ఆదోని నియోజకవర్గమా అన్న దానిపై స్పష్టత లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా



జగన్మోహన్‌రెడ్డి

జనసేన నాయకులు కూడా దీనిపై అధినేత నిర్ణయమే తమ నిర్ణయమని చెబుతున్నారు. సిపిఐ, సిపిఎం పార్టీలతో కూడా పొత్తుంటే సిపిఐ ఆలూరు లేదా పత్తికొండ కోరుకునే అవకాశం ఉందని, సిపిఎం కర్నూలు లేదా కోడుమూరు



పవన్‌కళ్యాణ్

నియోజకవర్గాల్లో ఏదో ఒక దాన్ని కోరుకుంటుందని భావిస్తున్నారు. ఈ రెండు పార్టీలు కాకుండా భాజపాతో పొత్తుంటే ఆ పార్టీ ఆళ్లగడ్డ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కొన్నింటిని కోరుకోచవ్చని అంచనా వేస్తున్నారు. చాలా కాలం క్రితమే భాజపా–తెదేపా మధ్య పొత్తు కుదిరితే ఆ పార్టీ ఎక్కువ పార్లమెంట్ స్థానాలను కోరుకుంటుందంటూ జరిగిన ప్రచారం నిజమైతే అసెంబ్లీ స్థానాలపై పెద్దగా పట్టు పట్టకపోవచ్చన్న వాదన కూడా ఉంది. ఏది ఏమైనా 2024 ఎన్నికలకు ఆరు నెలల గడువు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అధికారపక్షంలో అసమ్మతి, ప్రతిపక్షంలో గందరగోళం ఎలాంటి పరిస్థితులను సృష్టిస్తాయో చూడాలి.

## వలసలు వెళ్లే ప్రాంతాల్లో పనులు కల్పించండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న 100రోజుల పనిదినాలు పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి అర్జీలలో ఎక్కువగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే శాఖలకు సంబంధించి రీ ఓపెన్‌కు ఎక్కువగా వస్తున్నాయని వాటిని తగ్గించాలన్నారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి పెండింగ్ ఉన్న మాస్టర్ డేటాను ఎంపీడీవోలు మంగళవారం సాయంత్ర నాటికి వెరిఫై చేసి పంపాల న్నారు. అదే విధంగా వచ్చే సోమవారం నాటికి క్రీడల నిర్వహణకు అనువైన మైదానాలను గుర్తించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎంలను ప్రథమస్థాయిలో తనిఖీ చేసిన కేంద్ర పరిశీలకులు లలిత్‌మిట్టల్

(మొదటిపేజీ తరువాయి)



కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న లలిత్‌మిట్టల్

నిర్వహిస్తున్న ఫస్ట్‌లెవెల్ చెకింగ్‌ను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా సిబ్బంది హాజు పట్టికను, అలాగే సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరుపట్టికను కూడా పరిశీలించారు. ఈవీఎంల ప్రథమ స్థాయి పరిశీలన ప్రక్రియ నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేస్తామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, నోడల్ అధికారి సుబ్బారెడ్డి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఇప్పటి వరకు 2690 కంట్రోల్ యూనిట్లు, 3055 బ్యాలెట్ యూనిట్లు, 3060 వీవీ ప్యాట్ల ప్రథమస్థాయి పరిశీలన పూర్తయిందని మిగిలిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన ప్రక్రియను వచ్చేనెల 10వ తేదీ లోగా పూర్తిచేస్తామని ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిలు ఉన్నారు.

## సుండిపెంటలో కొండచిలువ కలకలం

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైల మండల కేంద్రమైన సుండిపెంట గ్రామ శ్రీకుమారస్వామి టెంపుల్ సమీపంలో సోమవారం సాయంత్రం కొండచిలువ కలకలం రేపింది. ఆలయం పక్కన గల మైదానంలో యువకులు క్రికెట్ ఆడుతూ కొండచిలువ సంచరించటాన్ని గుర్తించి భయాందోళనకు గురయ్యారు.తక్షణమే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శ్రీశైలం రేంజ్ అధికారి నరసింహులు,సెక్షన్ ఆఫీసర్ మదన్ ఆదేశాల మేరకు స్నేక్ రెస్క్యూవర్ కాళీ చరణ్ అక్కడికి చేరుకొని దానిని పట్టుకొని అటవీ శాఖ సిబ్బందితో కలిసి దట్టమైన నల్లమల అడవి ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.కొండ చిలువ దాదాపుగా 14 అడుగుల పొడవు రెండు సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.



## జగనన్న ప్రభుత్వంలో దోచుకో... దాచుకో...

– ప్రజలను మోసం చేస్తున్న రాజకీయ పార్టీలు

– కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

– సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు

**పత్తికొండ టౌన్, మేజర్‌న్యూస్ :** జగనన్న ప్రభుత్వంలో దోచుకో... దాడుకో అన్న విధంగా పరిపాలన సాగిస్తున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ గఫూర్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ బేరీ బస్సు యాత్ర ఆదోనిలో ప్రారంభమై ఆలూరు మీదుగా పత్తికొండకు చేరుకొంది. స్థానిక ఆర్టీసి బస్టాండు నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో గఫూర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని ధర్నాలు చేస్తే అక్రమ అరెస్టులు గృహ నిర్బంధాలు చే యడం



బైకు ర్యాలీనిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు

దుర్మార్గపు చర్య అన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ, బడ్జెట్లో కోత కోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని బిజెపి ప్రభుత్వం భారీ పరిశ్రమలను కల్పించలేదని, ప్రత్యేక హోదా వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, రైల్వే జోన్లు విశాఖను ప్రకటించలేనది, పొలవరం కృష్ణ జలాలు పంపకాలపై అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే, మంత్రులు ఇసుక, ఎర్రమట్టి మద్యం, సిమెంట్ ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, శివ నాగమణి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రామకృష్ణ, రాధాకృష్ణ, వీరశేఖర్, సీపీఎం మండల నాయకులు దస్తగిరి, పెద్దహూల్తి సురేంద్ర, సిద్దయ్య గౌడు, గంగన్న, రామాంజనేయులు, శ్రీరాములు, కొండారెడ్డి, రవి, రాముడు, ఆశోక్, ప్రజాసంఘాల నాయకులు రమేష్, తాజ్, మహ్మద్, కాశీ, మధు, వీరన్న, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలంతా ఏకం కావాల్సిందే

– బీజేపీ మీడియా ప్యానలిస్ట్ డాక్టర్ పార్థసారధి వాల్మీకి

**కర్నూలు,మేజర్‌న్యూస్ ప్రతినిధి:** వచ్చే తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని ప్రకటించడం హర్షణీయమని, పార్టీలకు అతీతంగా బీసలందరూ ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ మీడియా ప్యానలిస్ట్, ఓబీసీ మోర్చా నాయకులు డాక్టర్ పార్థసారధి వాల్మీకి అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ బీసీనీ సీఎంగా చేస్తామంటే తెలంగాణ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. ఒక బీసీ నరేంద్ర మోడీ ప్రధాని అయ్యకనే ఎస్సీ, ఎస్టీ కమీషన్లతో సమానంగా 65సంవత్సరాల తర్వాత బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా దక్కి విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీసీకి కమిషన్‌కు రాజ్యాంగ హోదా ఇచ్చాకే 27శాతం రిజర్వేషన్లు బీసీ బిడ్డలు అనుభవిస్తున్నారని, చక్కగా చదువుకుంటున్నారని, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. బీసీ ముఖ్యమంత్రి అయితే బీసీలకు రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.



డాక్టర్ పార్థసారధి వాల్మీకి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని విభాగాలను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లన్నీ కూడా ముందస్తుగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తికపౌర్ణమి, శుద్ధ, బహుళ ఏకాదశులు, ప్రభుత్వ సెలవురోజులలో భక్తులరద్దీ అధికంగా ఉంటుందని చెబుతూ రద్దీకనుగుణంగా ఆయా ఏర్పాట్లన్నీ పకడ్బందీ గా చేపట్టాలన్నారు. శౌచాలయాలకు,స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు, పాతాళగంగ మెట్లమార్గం మొదలైన చోట్ల అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఈ సమావేశంలో భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, శ్రీస్వామి, అమ్మవార్ల ఆర్జితసేవలు, ఆలయ వేళలు, క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ క్రమ బద్ధీకరణ, పారిశుద్ధ్యం, పార్కింగ్, కార్తీక సోమవారాలలో లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తికపౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, పుణ్యనదీహారతి ఏర్పాట్లు,

### శ్రీగిరిపై నవంబరు 14 నుండి

## కార్తీక మాసోత్సవాలు

కార్తికమాసంలో ఆకాశదీపం ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ మొదలైన అంశాలను గురించి సుదీర్ఘంగా చర్చించారు. భక్తులకు సేవలు అందించేందుకుగాను కార్తికమాసంలో రద్దిరోజులందు కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

**దర్శనం ఏర్పాట్లు**

– వేకువజామున 3 గంటలకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజల అనంతరం వేకువజామున 4.30 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు దర్శనాలు కల్పించబడుతాయి.అదేవిధంగా తిరిగి సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయి.

– కార్తికమాసంలో సోమవారాలు, ప్రభుత్వ సెలవుదినాలు మొదలైన రద్దీరోజులలో (కార్తికమాసంలో మొత్తం 13 రోజులపాటు) స్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేయబడుతుంది.

–రద్దీరోజులలో భక్తులకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది.

**ఆర్జితసేవలు**

– రద్దీరోజులలో (కార్తీకమాసంలో మొత్తం 13 రోజులు) గర్భాలయ ఆర్జిత అభిషేకాలు,సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేయబడుతాయి.

– సర్వదర్శనం క్యూలైన్ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తికమాస సాధారణ రోజులలో కూడా ఆర్జిత అభిషేకాలు పరిమితంగా నిర్వహించబడుతాయి.రెండు విడతలుగా ఆర్జిత హెూమాలు జరిపించబడుతాయి.

– రద్దీ రోజులలో అమ్మవారి అంతరాలయములో జరిపించే కుంకుమార్చనలు,అమ్మవారి ఆలయ ప్రాంగ ణంలోని ఆశీర్వచనమండపంలో జరిపించబడుతాయి.

**పాతాళగంగవద్ద ఏర్పాట్లు**

– కార్తికమాసములో భక్తులు పుణ్యస్నానాలకు ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా పాతాళగంగ వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడుతాయి.

–పాతాళగంగ వద్ద శౌచాలయాల నిర్వహణ,పారిశుద్ధ్యం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వంటి ప్రత్యేక ఏర్పాట్లను చేయనున్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి తోటి బ్యాచ్ పోలీసుల చేయూత

– అభినందించిన జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** 1998బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ లాలుషావలి కర్నూలు ఆర్మడు రిజర్వుడలో పనిచేస్తూ ఈ నెల 9వతేదీన అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు. తమ తోటి కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచేందుకు 1998బ్యాచ్ పోలీసులు తమ వంతు సహాయంగా సేకరించిన రూ.1.10లక్షల మొత్తానిన సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ చేతుల మీదుగా సోమవారం కానిస్టేబుల్ భార్య సాహినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విఎస్ రమణ, 1998బ్యాచ్ పోలీసులు, ఏఆర్ కానిస్టేబుల్ లాలుషావలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చెకుముకి పోటీల వల్ల విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం

జనవిజ్ఞాన వేదిక కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు కె. శంకరయ్య

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ సంబరాల గోడ పత్రికలు విడుదల




చెకుముకి పోటీల గోడ పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్ :** జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి ప్రతిభా పోటీల వల్ల విద్యార్థులకు సృజనాత్మకత, సైన్స్ పరిజ్ఞానం పెంపొందుతుందని జనవిజ్ఞాన వేదిక కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు కె. శంకరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని మునిసిపల్ హై స్కూల్, నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హై స్కూళ్లలో సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న చెకుముకి పోటీల గోడ పత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ 33 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక తెలుగు రాష్ట్రాలలో ప్రతిభ పోటీలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు సైన్స్ విజ్ఞానం పెరిగి, సమాజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు శాస్త్రీయ పౌరులుగా ఎదగడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. అయితే చెకుముకి సైన్స్ పోటీలలో పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు. 40 ఐచ్ఛిక ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రం ఉంటుందని..8,9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. నవంబర్ 10వ తేదీన పాఠశాల స్థాయి, 30న మండల, పట్టణస్థాయి, డిసెంబర్ 17న జిల్లాస్థాయి, 2024 జనవరి 27, 28వ తేదీన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు శంకరయ్య వెల్లడించారు. విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని, వారి ప్రతిభని వెలికి తీయడానికి జన విజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, హాలీం సిద్ధిక్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాదిలింగప్ప, శ్రీనివాసులు, రామాంజనేయులు, నరసయ్య గౌడ్, రంగన్న, దావీదు, రాఘవేంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీకి తొలగిన అడ్డంకి

**నందికొట్కూరు, మేజర్‌న్యూస్‌:** గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న ప్రభుత్వ స్థలం పంచాయితీ ఎట్టకేలకు ఆ గ్రామ సర్పంచ్ కృషితో అధికారులు స్పందించడంతో సమస్య పరిష్కారం అయింది. నందికొట్కూరు మండల పరిధిలోని బిజినివేముల గ్రామంలో ప్రభుత్వ స్థలమైన సర్వే నెంబరు 410లో దాదాపు 50 సెంట్ల స్థలంలో శ్రీను అనే వ్యక్తి గోశాల ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీ ఏర్పాటుకు సర్వే నెంబరు 410లో ఇళ్ల నిర్మాణానికి పట్టాలు అందజేశారు. అప్పటికే ఆ సర్వేలోని 50 సెంట్ల స్థలంలో గోశాల కొరకు భారీగా గడ్డివాములు ఉండడంతో రెవెన్యూ అధికారులు శ్రీను స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించినా, గోశాలకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయిస్తామని సూచించినా అతను ఖాళీ చేయలేదు. దాదాపు రెండు సంవత్సర కాలంగా ఈ వివాదం నడుస్తోంది. దీంతో పట్టాలు పొందిన లబ్దిదారులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల నిర్వహించిన మండల సమావేశాన్ని అడ్డుకున్నారు. దీంతో సోమవారం రెవెన్యూ అధికారులు ఆర్ ఐ శ్యామల, వీఆర్ఓ రషీద్‌లు పోలీసు బందోబస్తుతో వెళ్లి గడ్డివాములను ట్రాక్టర్ల ద్వారా గోశాలకు కేటాయించిన స్థలంలోకి తరలించారు. దీంతో లబ్దిదారులకు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. ఈ సందర్భంగా ఎటువంటి గొడవలు జరుగకుండా ఎస్ఐ వెంకట సుబ్బయ్య బందోబస్తు నిర్వహించారు.

# ప్రజలు ఆరోగ్యంగా జీవించాలి..గ్రామ సర్పంచ్ మహేశ్వరీ



గ్రామస్తులకు వైద్య సూచనలిస్తున్న వైద్యులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** ప్రజలు ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి గ్రామ, పట్టణ నగరాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలను అందించడం ఎంతో సంతోషకరమైన విషయమని పిఆర్.పల్లె గ్రామ సర్పంచ్ మహేశ్వరి అన్నారు. సోమవారం గ్రామంలో ఎంపిడిఓ ఫజుల్‌రహిమాన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 551 ఓపిలు చూసి, అందులో ఆరుగురిని రిఫరల్ చేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ మారుతీ, ఉప సర్పంచ్ ప్రేమసాగర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీరాములు, గ్రామపెద్దలు నరసింహారెడ్డి, మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామాంజినేయులు, వెంకటేష్, రాజారెడ్డి, వైద్యులు డాక్టర్ నితీష్, డాక్టర్ నుష్రత్ ఉజాహర, డాక్టర్ సహృదయ్, డాక్టర్ అభినయ్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎర్రమట్టి మాఫియాపై రెవెన్యూ శాఖ కాపలా

– చెరువు వద్ద మకాం



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని గాజులపల్లె చెరువు ఎర్రమట్టి మాఫియాపై రెవెన్యూ శాఖ కాపలా కాస్తుంది. చెరువు వద్దనే తలారిలు, వీఆర్వోలు, కాపలా ఉంటున్నారు. రాత్రి వేళల్లో ఎర్రమట్టి మాఫియా పంజా విసురుతుండటంతో రెవెన్యూ శాఖ కట్టడికి నడుం బిగించింది. మాఫియాకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో రెవెన్యూ శాఖ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి అనుకొని ఉండటంతో జిల్లా బాస్‌లకు ఫిర్యాదులు అందుతుండటంతో మండల రెవెన్యూ శాఖ ఎర్రమట్టిని తరలించకుండా ఉండేందుకు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. చెరువు వద్దకు వెళ్లిన వాహనాలను తిప్పి పంపిస్తున్నారు. ఎర్రమట్టి రవాణా చేస్తే చర్యలు తప్పవని మహానంది తహశీల్దార్ జనార్ధన్‌శెట్టి మేజర్‌న్యూస్‌కు తెలిపారు.




# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూలు నుంచి వస్తున్న లారీ ఎమ్మిగనూరు నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. గోనెగండ్ల మండలం ఐరన్ బండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజుకు (50) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రహదారులపై వ్యాపారం చేస్తూ అంతరాయం కలిగిస్తే చర్యలు



వ్యాపారస్తులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో, ఎస్ఐ

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రహదారులపై వ్యాపారం చేస్తు వాహనదారులకు అంతరాయం కలిగిస్తే వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్ఐ తిమ్మారెడ్డి రహదారిపై వ్యాపారం చేసుకుంటున్న వారి హెచ్చరించారు. సోమవారం గోనెగండ్లలోని పాత బస్టాండ్ నుంచి గంజహళ్లి రోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రదాన రహదారికి ఇరువైపుల వ్యాపారాలు చేసుకునే వారు ప్రయాణి కుల రాక పోకలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని రహదారికి అడ్డదిడ్డంగా మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాలు నిలపడం వల్ల ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది కావున రోడ్డు అడ్డంగా వాయనాలను పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. హెూటళ్లు, పానిపూరి బండ్లు, బేకరి షాపుల వారు తమ దుకాణాల దగ్గర వాహనాలు నిలుపుకోకుండా చూసుకోవాలని సూచించారు.

# మహిళ మెడలోని గొలుసు అపహరణ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని అబ్బాసనగర్‌లో నివాసముంటున్న తెలుగు శివమ్మ అనే మహిళ మెడలోని గొలుసును చైన్‌స్నాచర్లు లాక్కెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 14వతేదీన అమావాస్య రోజున తన మనువడికి కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రోడ్డులో దిష్టి తీసి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి తన మెడలోని చైన్ లాక్కెళ్లారని, అయితే 4వపట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సోమవారం 4వ పట్టణ సీఐ శంకరయ్య విచారణ జరిపి కేసు నమోదు చేశారు.

# విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన మహానంది

**ఆస్పరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన మహానంది(53) విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు, మహానంది సమీపంలోని వెంకటేష్ హోటల్ వద్ద టీ తాగేందుకు వచ్చాడు. హోటల్‌కు సంబంధించిన లక్ష్మీ షెడ్డుకు సపోర్టుగా ఉన్న ఇనుప పైపులు పట్టుకొంది. విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే కింద పడింది. అక్కడే ఉన్న మహానంది విషయం తెలుసుకొని ఏంటీ పరిస్థితి అని ఆమెను ప్రాణాలు కాపాడపోయ్ తాను విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుతూర్లు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్.ఐ వివరణ కోరగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ వరప్రసాద్ తెలిపారు.

## ఎమ్మిగనూరు తపాలశాఖ నూతన ఇన్స్‌పెక్టర్‌గా రమేష్ రెడ్డి నియామకం

మర్యాద పూర్వకంగా కలిసిన తపాల ఉద్యోగుల సంఘం నాయకులు



పోస్టల్ ఐపీఓ రమేష్ రెడ్డికి సన్మానిస్తున్న తపాలా ఉద్యోగులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్సెపెక్టర్ గా పదోన్నతి పై రమేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాంచి కార్యదర్శి ఎరుకల కృష్ణ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ బ్రాంచి అధ్యక్షులు విజయలక్ష్మి, సీనియర్ పోస్ట్ మాస్టర్ గోపాల్, ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో గ్రామీణ తపాల ఉద్యోగులు, డిపార్ట్మెంట్ ఉద్యోగులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం తమరు చొరవ తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారము కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. తపాల శాఖ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐజీడీఎస్ యూ సీనియర్ నాయకుడు నాగరాజు స్వామి, నాయకులు మునిస్వామి, పద్మ, తులసి, కౌలుట్లమ్మ , రంగన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సూర్య

మంగళవారం 31 | అక్టోబరు 2023

# ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు



ఎమ్మెల్యే కు స్వాగతం పలికిన వైసీపీ నాయకులు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** గతంలో ఎప్పుడూ లేని విధంగా వైసీపీ పాలనలో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు.సోమవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు ఎంపీపీ వీరభద్రుడు,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి,ఎంపిటీసిరాజేశ్వరి,వైసీపీ నాయకులు,కార్యకర్తలు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సమస్యలను సత్వరమే పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,గణపతిరెడ్డి,ఎద్దులలక్ష్మిరెడ్డి,వెంకటేశ్వర రెడ్డి,బచ్చుసుబ్రమాణ్యం,హనుమంతరెడ్డి, సుమన్,వేణు, నారాయణరెడ్డి,మాజీ సర్పంచ్ సుబ్బలక్షుమ్మ, జయ రామిరెడ్డి,ఎంపీటీసీలు పత్తినారాయణ,లక్ష్మిరెడ్డి,పుల్లయ్య,దస్తగిరి,రాముడు,సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్,ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఏఈలు షాజహాను,కొండారెడ్డి,షఫివుల్లా,పంచాయితీ కార్యదర్శి స్వప్న,ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాల్మీకి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలి..

**– అన్నిరంగాల్లో రాణించాలి – టీడీపీ మాజీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ**

**ఆదోని రూరల్, మేజర్‌న్యూస్ :** వాల్మీకి మహర్షి అడుగు జాడల్లో ప్రతి ఒక వాల్మీకి నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ టీడీపీ ఇంచార్జీ, వాల్మీకి ముద్దు బిడ్డ గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. శనివారం మంత్రాలయంలో వాల్మీకి విగ్రహా ఆవిష్కరణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాల్మీకులంతా ఐక్యంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయంగా, సామాజీకంగా, ఆర్థికంగా వాల్మీకులు ఏదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా వాల్మీకి మహర్షిలాగే ప్రతి వాల్మీకి కూడ కలమే ఆయుధంగా ముందుకెళ్ళి ఉన్నత చదువులు చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మురళీ, సాధిక్ వలి, రాఘవరెడ్డి, చిరంజీవి, భరత్, వీరేష్ మంత్రాలయం వాల్మీకి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహావిష్కరణలో కృష్ణమ్మ

# రాష్ట్రంలో దొంగల రాజ్యం నడుస్తోంది..

**– వైసీపీ వచ్చాక రౌడీయిజం మొదలైంది**

**– కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్**




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

**ఆదోని,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో దొంగలరాజ్యం నడుస్తోందని, వైఈపీ వచ్చాక రౌడీయిజం మొదలైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీనివాస్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజారక్షణ బేరీ యాత్ర జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కేంద్ర కమిటీ సభ్యులు, కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు గఫూర్, ఆశోక్ దావలేలు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలో అసమానతల్లు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయక ప్రజలపై అనేక రకాలుగా భారాలు మోయడం జరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలు ఆదాని, అంబానీలకు కారు చౌకగా అమ్మి వేశారన్నారు. విభిన్న సంస్కృతులకు మతాలకు నిలయమైన దేశాన్ని మతోన్మాదంలో ముంచి దేశాన్ని సర్వనాశనం చేశారన్నారు. రాష్టానికి బిజెపి ప్రభుత్వం భారీ పరిశ్రమలను కల్పించలేదని, ప్రత్యేక హోదా వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ, రైల్వే జోన్లు విశాఖను ప్రకటించలేనది, పొలవరం కృష్ణ జలాలు పంపకాలపై అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే, మంత్రులు ఇసుక, ఎర్రమట్టి మద్యం, సిమెంట్ ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడుతున్నా రన్నారు. రాయలసీమ జిలాల్లో కరువు సమస్యపై ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు ప్రబాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రమాదేవి, అనీల్ కుమార్, భాస్కర్, వెంకటేశులు, రామాంజనేయులు ఆనంద్‌బాబు, రాధాకృష్ణ, పట్టణ మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, సీనియర్ నాయకులు ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందుతున్నాయా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో టెక్కె ప్రాంతంలో కౌన్సిలర్ కాల్వ సరస్వతి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మా ప్రభుత్వం కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు జగనన్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు. గత ప్రభుత్వానికి వైయస్సార్ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. విద్యా వైద్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు పోతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక బాషా, చైర్‌పర్సన్ మాబున్నీసా, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత, పడకండ్ల సుబ్రమన్యం, శివ, వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఖాద్రి, పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మూలింటి మారెప్ప



పార్టీలో చేరిన మూలింటి మారెప్ప

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి మూలింటి మారెప్ప కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగురుద్రరాజు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాహుల్‌గాంధీ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి క్రాంతినాయుడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మినరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శి గార్లపాటి మద్దులేటి స్వామి పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా**

# సనం రెడ్డి సుహాసిని



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం మహిళా విభాగం తరుపున సనం రెడ్డి సుహాసిని ఎంపిక చేశారు. మహిళా విభాగం నుండి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఎంపికైన సుహాసినిని నంద్యాల ప్రాంతానికి చెందిన రెడ్డి సంఘం సభ్యులు సంఘం నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం,ఉపాధ్యాయులు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరి షత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కోటయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలోవారు మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో పాఠశాలకుచెందినసాయిచరణ్, కార్తిక్‌లు, బాలికలవిభాగంలో నవ్యశ్రీ, హరితలు,అండర్-14 బాలుర విభాగంలో మాబుషరీఫ్,బాలికల విభాగంలో లక్ష్మికళ్యాణీ,మనీషాలు ఎంపికయ్యారన్నారు.ఈ నెల 11 న కర్నూలులో జరిగిన ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 4 న ఒంగోలు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ -17 క్రీడాకారులు ,గుంటూరులో జరిగే పోటీలలో అండర్-14కు చెందిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కోటయ్య,పిడి దాదాపీర్,పిఈటి భారతి,ఉపాధ్యాయులు శాస్త్రి,రవీంద్రారెడ్డి,శ్రీనివాసులు, శివశంకర్, మహబూబ్‌భాష,నరసింహరెడ్డి,హరిహరనాథరెడ్డి, వెంకటరాముడు, వినయ్ కుమార్, సురేషప్ప తదితరులు అభినందించారు.

## దస్తగిరి స్వామికి ఫాతేహాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే బీసీ



బీసీని సత్కరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు సమీపంలో ఉన్న జెండావాలే సాహెబ్ దర్గా పీఠాధిపతి హజరత్ ముఫ్తీ సయ్యద్ అబ్దుల్ హుసేన్ ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో దర్గా నందు గంధం, ఉరుసు నిర్వహించడం జరిగింది. సోమవారంనాడు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి అక్కడికి వెళ్లి పూల చద్దర్ సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాజీ ఎమ్మెల్యేకు శాల్వ కప్పి సత్కరించారు. ముస్లీం మైనార్టీలు పాల్గొన్నారు.

## నేటి నుండి అహోబిలంలో ఉచిత వైద్య శిబిరం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** అహోబిలంలో నేటినుండి మూడు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిపిఏ సంపత్, ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహోబిలం 46వ పీఠాధిపతి ఆశీస్సులతో సేలం తమిళనాడుకు చెందిన శ్రీ భక్త వర ప్రసాద వరద ఆంజనేయ స్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆళ్లగడ్డ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అభివృద్ధికి అండగా నిలుద్దాం.. ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి

**డోన్, మేజర్‌న్యూస్:** మన నియోజకవర్గం, పట్టణం, గ్రామంలో జగనన్న ప్రభుత్వం చేపడుతున్న, చేపట్టిన సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించి, అభివృద్ధికి అండగా నిలుద్దామని ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని షాధిఖాన నందు సోమవారం మండలంలోని వాలంటీర్లకు, గృహసారధులకు మండల వైకాపా అధ్యక్షులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ టి.రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఏపి మీట్ కార్పోరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ తిరునాంపల్లి తిరుమలరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వాలంటీర్లు, గృహసా రథులు ప్రజలలోకి విస్త ృతంగా తీసుకెళ్ళి, వాటి గురించి ప్రతి ఒక్కరికి అర్ధమయ్యేలా వివరించాలన్నారు. వైకాపా నాయకులు, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, వైకాపా కార్యకర్తలు, వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

## ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్ష,కార్యదర్శుల ఎంపిక

**అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ శైలజ, డాక్టర్ సుసుమ**



నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం నూతన కార్యవర్గం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం సర్వ సభ్య సమావేశంలో రానున్న రెండు సంవత్సరాలకు ఈ విభాగం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్. నెరవాటి అరుణ కుమారి, గౌరవ అధ్యక్షురాలుగా డాక్టర్ నాగమణి, కార్యదర్శులుగా డాక్టర్ శైలజ డాక్టర్ సుసుమా ,కోశాధికారిగా డాక్టర్ రాధిక,ఉపాధ్యక్షులుగా డాక్టర్ నాగరేఖ ,డాక్టర్ చంద్రకళ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ అరిఫాబాను, డాక్టర్ అనిత, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ,డాక్టర్ జ్యోతి వాణి ,డాక్టర్ భారతి,డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ స్ఫూర్తి, డాక్టర్ తనూజ ,డాక్టర్ సింధు, డాక్టర్ అనూష,డాక్టర్ హారిక,డాక్టర్ జాస్మిన్ సుల్తానా,డాక్టర్ అనూషరాఘవేంద్ర,డాక్టర్ ఆశాలత, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ దివ్య తేజ,డాక్టర్ మధు ప్రీతి ఎంపికయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ నెర వాటి అరుణకుమారి, డాక్టర్ శైలజ డాక్టర్ సుసుమా మాట్లాడుతూ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ద్వారా కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ ప్రత్యేక కార్యక్రమాలు, పాఠశాలలో, కళాశాలలోబాలికలకు అవగాహన సదస్సులునిర్వహించబోతున్నామని తెలిపారు.నూతన కార్యవర్గాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అభినందించారు.

## అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం సింధూర

**చాగలమర్రి,మేజర్‌న్యూస్:**మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో గల బర్డ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన సంజనాశ్రీ,భార్గవిరెడ్డి, వైష్ణవిలు అంతర్జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సింధూర తెలిపారు.సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 17వరకు తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సంజనాశ్రీ,భార్గవిరెడ్డిలు బంగారు పతకాలను,వైష్ణవి వెండి పతకాన్ని సాధించారని తెలియజేసారు. అద్భుత ప్రతిభ కనబరచిన వీరు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు.త్వరలో థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.విద్యార్థులను,శిక్షకుడు రవిశంకర్ ను బర్డ్స్ సంస్థల అధినేత పాల్‌జారావు,హెచ్ఎం సింధూర,ఇంచార్జ్ హెచ్ఎం బార్నబాస్,కోఆర్డినేటర్ భాస్కర్,బోధన,బోధనేతర సిబ్బంది అభినందించారు.

## రావూస్ కళాశాలలో ఆఫ్ క్యాంపస్ నియామకాలు..!



మాట్లాడుతున్న కళాశాల సీఈవో తిరుమల రెడ్డి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని రావుస్ డిగ్రీ కళాశాలలో నవంబర్ 2వ తేదీన రావుస్ కళాశాల ఆధ్వర్యంలో హెట్రో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారిచే నిరుద్యోగులకు ఆఫ్ క్యాంపస్ నియామకాలు జరగనున్నాయని రావుస్ డిగ్రీ కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి తెలిపారు. ఈ ఆఫ్ క్యాంపస్ నియామకాలకు విద్యార్హతలు ఏదైనా డిగ్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఐటిఐ ఫిట్టర్ డిప్లమా ఇన్ మెకానికల్ చదివిన వారు అర్హులు,అంతేగా క వార్షిక ఆదాయము రెండు లక్షల నుండి మూడు లక్షల వరకు ఉంటుందని సీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## దిగువ అహోబిలంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోపవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ప్రధానార్చకులువేణుగోపాలచార్యులు,అర్చక బృందం ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా పవిత్రాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వేదమంత్రాల మధ్య హెూమం నిర్వహించారు. ఈ పవిత్రోత్సవా లు మఠం ప్రతినిధి సంపత్, ఓ ఎస్‌డి శివప్రసాద్ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి.

## శ్రీ ఉమామహేశ్వరులకు పల్లకీ సేవ

**బనగానపల్లెరూరల్,న్యూస్ః**



స్వామి వారి పల్లకీ సేవ దృశ్యం

యాగంటి శ్రీ ఉమా మహేశ్వరస్వామి దేవస్థానం నందు సోమవారం నాడు వైభవంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి నంది మండపం నందు పూజలను నిర్వహించిన అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ తోట బుచ్చిరెడ్డి , ఆలయ అర్చకు లు పాల్గొన్నారు.

## అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యం..ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ

**ప్రభుత్వ సేవలన్నీ ప్రజల వద్దకే రావడం ఎంతో సంతోషకరం**



విలేజ్‌హెల్త్‌క్లీనిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు, అధికారులు, హెల్త్ సిబ్బంది

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** రాష్ట్రాభివృద్ధిలో నేడు దేశంలోని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, సిఎం జగన్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారని, అభివృద్ధి ఒక్క సిఎం జగన్‌తోనే సాధ్యమవుతుందని పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో రూ. 23.90లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, అదేవిధంగా రూ. 20.80లక్షలతో నూతనంగా నిర్మించిన వైయస్ఆర్ విలేజ్‌హెల్త్ క్లీనిక్‌లను గ్రామ సర్పంచ్ రాములమ్మ, వైస్ ఎంపిపి బత్తిన రాజేశ్వరి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కర్నూలు జిల్లా వ్యవసాయ సలహ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డితో కలిసి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ప్రత్యేక పూజలు చేసి, రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం వ్యవసాయశాఖ, విలేజ్‌హెల్త్ క్లీనిక్ సెంటర్ వారి ఆధ్వర్యంలో పూలమాలలతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మను సన్మానించారు. అదేవిధంగా గ్రామంలో కళ్యాణ మండపాన్ని క్రిష్ణగిరి జడ్పిటిసి కేఈ.సుభాషిణీతో కలిసి ఎమ్మెల్యే పనులను పరిశీలించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ నేడు రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారంటే అది సిఎం జగన్ పాలనకే సాధ్యపడిందన్నారు. ప్రజలకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఏకంగా గ్రామాలలోని గ్రామ సచివాలయాలను, విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లను, రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అందించే ప్రతి సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇలాంటి ప్రజల మనిషికి, అభివృద్ధి ప్రధాతకు రాబోయే రోజులలో కూడా మనమం దరం అండగా ఉండి మరింత అభివృద్ధికి తోడుగా నిలవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయితీ రాజ్ డిఈ, వ్యవసాయశాఖ అధికారి ఆర్.అక్బర్‌భాషా, పంచాయితీరాజ్ సురేంద్రనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజలు, వైకాపా గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

## చంద్రబాబు రాష్ట్రానికే కాదు దేశానికీ ఆదర్శం..

**ప్రజలు విసిగిపోయారు.. 2024లో టిడిపి అధికారంలోకి రావడం తథ్యం**
**ఏనాడూ టిడిపి కక్ష సాధింపులకు పాల్పడ లేదు..**
**అలా చేసిఉంటే 2019లో వైసిపి అధికారంలోకి వచ్చేదేకాదు**
**విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు.



సమావేశానికి హాజరైన తెదేపా శ్రేణులు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్ :** తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో సంపద సృష్టించి ఆ ఫలాలను భావిత రాల ప్రజలకు అందించగల సమర్థత ఉన్న గొప్ప పరిపాలనాదక్షుడు దేశంలో తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కరే. అలాంటి ముందుచూపు ఉన్న జాతీయ నాయకుడైన చంద్రబాబు నాయుడు తెలుగు రాష్ట్రాలకే కాదు.. దేశానికి కూడా ఎంతో ఆదర్శం అని ఆదోని నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షి నాయుడు అన్నారు.సోమవారం పట్టణంలోని స్థానిక జేబీ గార్డెన్ లో మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాయకులు, తెదేపా శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనేక విషయాలపై పార్టీ శ్రేణులకు దశా దిశా నిర్దేశనం చేశారు. నియోజకవర్గంలో ఓటర్ల వెరిఫికేషన్ ఎలా చేపట్టాలి?, టిడిపి మేనిఫెస్టో గురించి అలాగే అధికార పార్టీ అసమర్ధ పాలన గురించి ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి?, అదేవిధంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ తదితర వాటి గురించి పలు అంశాలపై వారు చర్చించారు.రాష్ట్రపార్టీఆదేశాల మేరకు నవంబర్ 1వ తేదీ నుండి దాదాపు 45 రోజుల పాటు బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ ఇటీవల తెలుగు ప్రజలలో చాలా మార్పు వచ్చింది. గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఆదివారం నారా చంద్రబాబునాయుడుకు మద్దతుగా దేశవ్యాప్తంగా ఉన్న తెలుగుప్రజలు, ఐటీ ఉద్యోగులు, యువత వేలాదిగా తరలి రావడమే అందుకు నిదర్శనం అన్నారు. అక్రమ కేసులలో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ 10 సంవత్సరాలుగా సీఎం జగన్ బెయిల్ పై ఉన్నారు. కానీ ఎలాంటి తప్పు చేయని చంద్రబాబు మాత్రం 52 రోజులుగా జైలులో ఉండడం, ఆయనకు బెయిల్ రాకుండా అడ్డుపడటం చాలా బాధాకరమన్నారు. జైల్లో చంద్రబాబు ఆరోగ్యంపై మీనాక్షినా యుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఏనాడూ చంద్రబాబు నాయుడు కక్ష సాధింపులకు పాల్పడలేదని, అలా చేసి ఉంటే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చేదే కాదన్నారు. ఇన్నాళు చంద్రబాబు క్షేమం కోసం దేవాలయాలు, మసీదులు, చర్చిలలో ప్రజలతో కలిసి ప్రార్థనలు చేశామని, ఆ భగవంతుని చల్లని ఆశీస్సులతో చంద్రబాబు జైలు నుంచి బయటకు వస్తాడన్న నమ్మకాన్ని కరతాల ధ్వనుల మధ్య వ్యక్తపరిచారు. 2024లో టిడిపి విజయం తథ్యమన్నారు. రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని, టిడిపి జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో కలిసిమెలిసి పని చేయాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పిలుపునిచ్చారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, కర్నూలు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, రామస్వామి, రంగస్వామినాయుడు, బుద్ధా రెడ్డి, మారుతి నాయుడు, తిమ్మప్ప, మల్లిఖార్జున, వెంకటేష్ చౌదరి, అప్సర్ బాషా, దొడ్డనగేరి శివ ప్ప, మారుతిరావు,ఆరేకల్లురామకృష్ణ, జయరాం, వీరేష్, ఐటిడిపి సజ్జాద్ హుస్సేన్, ఉరుకుంద, తదితర కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు రిడ్జ్ పాఠశాల విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని హాసిని అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నవంబర్ 4వతేదీ నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో జరుగనున్న 65వ రాష్ట్రాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగం జట్టుకు రిడ్జ్ పాఠశాల విద్యార్థిని సి.ఎం. హాసిని ఎంపికైనట్లు పాఠవాల సీఈవో గోపినాథ్ సోమవారం తెలిపారు. గోపినాథ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతో సమానంగా క్రీడలకు అధిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థిని అభినందించారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, ఫుట్‌బా ల్ శిక్షకుడు బ్రహ్మకుమార్ పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరచిన సంసిధ్ శ్రీలక్ష్మీ పాఠశాల విద్యార్థి



విద్యార్థి కేతన్‌ను అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ఈ నెల 26వతేదీ నుంచి 29వతేదీ వరకు జరిగిన అథ్లెటిక్స్‌లో కర్నూలు నగరం లోని సంసిద్ శ్రీలక్ష్మి పాఠశాల విద్యార్థి రెడ్డిచెర్ల కేతన్ మంచి ప్రతిభ కనబరిచారు. దీంతో వచ్చే నెల 5వతేదీన ఛత్తీస్‌ఘడ్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంసుశీల, పీఈటీ మాస్టర్ రాంబాబు పాల్గొన్నారు.

సూర్య



# పేదల ఆరోగ్యానికి ధీమా

## పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి ధీమా లభించిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 28వ వార్డులోని సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యం అందక ఏ ఒక్కరూ బాధపడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తద్వారా పేదలకు సిఎం మెరుగైన వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. ప్రజల వద్దకే ప్రభుత్వం అనే ముఖ్యమంత్రి నినాదానికి ఇదొక ఉదాహరణగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి, దండు లక్ష్మి కాంత్ రెడ్డి, వైకాపా నాయకులు సత్యం రెడ్డి, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యానికి పెద్దపీఠ వేసిన ఏకైక ముఖ్యమంత్రి



పిల్లలకు పౌష్టికాహారాన్ని నాయకులు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం అందించడమే కాకుండా వైద్యానికి పెద్దపీఠ వేసిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అని వైసీపీ నేతలు భీమ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్నారు. ముందుగా వైద్య సేవల గురించి వృద్దులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జగన్నాథ్, భీమ్‌రెడ్డి, వైద్యాధికారులు సురేష్, గీత, గోవిందమ్మ, గౌతమ్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీబాయి, పంచాయతీ సెక్రటరీలు వేణుగోపాల్, మహేష్, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడి వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సరైన పత్రాలు చూపించి మొబైల్ ఫోన్లను తీసుకెళ్లండి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ః** జిల్లా పోలీసు కార్యాలయంలో ఈనెల 8న జరిగిన మొబైల్ రికవరీ కార్యక్రమంలో బాధితులు పోగొట్టుకున్న 510 సెల్‌ఫోన్లలో 108 సెల్‌ఫోన్లు ఫిర్యాదుదారులు తీసుకెళ్లలేదని, సరైన పత్రాలు చూపించి ఫిర్యాదుదారులు తమ ఫోన్లను తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తె లిపారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు సమాచారం అందినా వివిధ కారణాలతో గైర్హాజరైన బాధితులు తమ ఫోన్లను పోలీసు కార్యాలయం నందుగల సైబర్ క్రైం కార్యాలయానికి వచ్చి పత్రాలు చూపించి తమ ఫోన్లను తీసుకెళ్లాలని ఆయన తెలిపారు.

# సర్వేయర్ రెడ్డప్పయాదవ్‌పై దాడి అమానుషం

## మండల యాదవ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌యాదవ్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** పీలేరు తహశిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ రెడ్డప్పయాదవ్‌పై జరిగిన దాడి అమానుషమని మండల యాదవ సంఘం అధ్యక్షులు రామ్మోహన్‌యాదవ్, యువజన సంఘం అధ్యక్షుడు కోదండరామయ్యయాదవ్‌లు అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ బడుగు, బలహీన వర్గాలపై అగ్రవర్ణ కులాల ఆధిపత్య పోరు ఇంకెప్పటికీ మారుతుందన్నారు. తన ఉద్యోగాన్ని తను ఎంతో నిబద్దతతో చేసుకుంటున్నప్పటికీ కొందరు అగ్రవర్ణ కులాలకు చెందిన వైకాపా నాయకులు రెడ్డప్పయాదవ్‌పై అసభ్యకర పదజాలలతో దూషిస్తూ వారిపై పాల్పడినటువంటి అనీల్‌రెడ్డి, సునీల్‌రెడ్డిలపై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకొని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. యాదవులు అంటే ఈ అగ్రవర్ణాలకు ఎందుకంత ఈర్ష్య అని, రాష్ట్రంలో అధికశాతం కలిగిన యాదవులు తలచుకుంటే ప్రభుత్వాన్ని పడగొట్టడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు వెంకటరంగయ్య యాదవ్, జంగా రమణయ్యయాదవ్, వేణుగోపాల్‌యాదవ్, కంబగిరి రాముడుయాదవ్, ఈశ్వర్‌రెడ్డియాదవ్, సుమన్‌యాదవ్, శివకృష్ణయాదవ్‌లు పాల్గొన్నారు.

## నేడు ప్రజారక్షణ భేరి

# బస్సుయాత్ర సభ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అదే విధంగా బీజేపీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న వైసీపీ ప్రభుత్వ విధానాలన, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర అభివృద్ధి కోసం మాట్లాడకుండా ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని బీజేపీపై వత్తిడి తీసుకోవాలని కోరుతూ సీపీఎం ప్రజారక్షణ బేరిలో భాగంగా బస్సు జాత నంద్యాల పట్టణానికి వస్తున్న సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్ థియేటర్ దగ్గర జరిగే బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాగరాజు, పుల్లా నరసింహులు, తోట మద్దులు, గౌస్, లక్ష్మణ్, వెంకట్, లింగంలు పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధికే టిడిపి పెద్దపీఠ



బాబుతో నేను పోస్టర్‌తో మహిళలు, టిడిపి నాయకులు

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ః** రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికే టిడిపి పార్టీ పెద్దపీఠ వేస్తుందని మహాశక్తి సభ్యురాలు ఈర్నపాడు లక్ష్మిదేవి తెలిపారు. సోమవారం మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో మహాశక్తి, బాబుతో నేను అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన టిడిపపి ప్రవేశపెట్టిన మినీ మానిఫెస్టోను మహిళలకు వివరించారు. మానిఫెస్టో ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని నిరుద్యోగులు, విద్యార్థులు భవిష్యత్తుకు టిడిపి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి సైకో ముఖ్యమంత్రి రాక్షస ఆనందాన్ని పొందుతున్నాడని త్వరలోనే నిజం బయటకు వస్తుందని తమ నాయకుడు జైలు నుండి విడుదల అవుతాడని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు ప్రతి మహిళలు కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబుతో నేను అనే పోస్టర్లను ఆవిష్కరించి చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, జాకీర్ ఖాన్, తాటికొండ బుగ్గరాముడు, కాకనూరు నాగేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంగళరెడ్డి పేట శ్రీను, చలమయ్య, మహాశక్తి సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# అదాని.. అంబానీలకు తొత్తుగా బిజెపి పాలన

(మొదటిపేజీ తరువాయి)

రైతుల సమస్యలు, పరిశ్రమల మూత, నిరుద్యోగం, పేదరికం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి - ప్రజా సమస్యలు అధ్యయనం కోసం సిపిఎం బస్సు యాత్ర చేపట్టింది. రాష్ట్రంలో 12 రోజులు బస్సు యాత్ర తర్వాత నవంబర్ 15న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆధ్వర్యంలో విజయవాడలో బహిరంగ సభ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు, మేధావులు సహకరించాలని కోరారు. సోమవారం ఆదోని నుంచి కర్నూలు చేరుకుంది. ఈ సందర్భంగా కర్నూలు నగరం సిపిఎం సిటీ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథులగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌దావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి నాయకులు పి.నిర్మల, కె.రాముడు, రాధాకష్ణ, సిపిఐ మునెప్ప, ఉమామహేవ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పొలిట్‌బూయరో సభ్యులు అశోక్ దావలే మాట్లాడుతూ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం ఏమనగా అన్ని రకాల ప్రజల ప్రధాన సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. విద్యుత్ మీటర్లుకు స్మార్టు మీటర్లు పెట్టి రైతులపై భారాలు వేస్తుందన్నారు. రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో పరిశ్రమలు మూత పడి యువతకు ఉద్యోగాలు లేక వలసలు వెళ్తున్నారన్నారు. కరోనా సమయంలో రైతులపై తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 366 రోజులు ఉత్తర భారత దేశంలో రైతులు పోరాడి 700 మంది రైతులు బలిదానాలు చే సి వ్యతిరేకించారన్నారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం రోజు రోజుకు పెరిగిపోతుందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్ ధర 400 నుంచి 1200 పెంచిన ఘనత బిజెపికే దక్కుతుందన్నారు. అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాలో బస్సు యాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో జగన్ 30 ఏళ్లు నియంతలా పాలించాలని ప్రజలను, ఉద్యోగులను, నాయకులను ధర్నాలు, ఆందోళనలు చేయకుండా పోలీసులతో అణిచివేస్తున్నారన్నారని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఉన్న పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆదోని నుంచి వస్తుంటే వట్టి వరువు నెలకొందని, రైతులు, కూలీలు కార్మికుల సమస్యలు స్థానిక పాలకులకు పట్టడం లేదన్నారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రుల్లో గుమ్మనూరు జయరాం ఇళ్లు వదలరు... బుగ్గన్న ఢిల్లీ వదలరు అని పేర్కొన్నారు. బుగ్గన రాష్ట్రనికి ఆర్థిక మంత్రి కాదు... అప్పుల మంత్రి అని ఎద్దేవా చేశారు. ఒక్క అవకాశం అన్న జగన్ రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి తన నిరంకుశ పాలన సాగిస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా తుంగభద్ర ఉన్నా సాగు.. తాగునీటికి కటకట ఉందన్నారు. తాము ఏవ్వరికి భయపడమని.. ప్రజల పక్షాన.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. దేశంలో బిజెపి.. రాష్ట్రంలో వైసిపి 2024లో ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తెలిపారు. అంతకు ముందు ప్రజా నాట్యమండలి కళాకారులు పాటలు.. నృత్యాలు ప్రజలను ఏంతో ఉత్తేజ పరిచాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న సీపీఎం నాయకులు



హాజరైన సీపీఎం నాయకులు

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### పర్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం

### ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



**కల్లూరు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే, వై కా పా నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం పర్ల గ్రామంలోగడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో పర్ల ఎంపిటిసి అశోక్ కుమార్ రెడ్డి, కల్లూరు మండలం సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి, కార్పొరేటర్ దండు లక్ష్మి కాంత్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమణారెడ్డి, వైకాపా నాయకులు పెదపాడు శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్ వై కా పా మహిళ విభాగం జోనల్ ఇంచార్జ్ శ్వేతారెడ్డి, కార్యకర్తలు,సచివాలయ సిబ్బంది, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 7వ జిల్లాస్థాయి త్రోబాల్ క్రీడా విజేతలకు ట్రోఫీ అందజేత




త్రోబాల్ క్రీడా విజేతలకు ట్రోఫీ ప్రధానం చేసిన దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీలో ఉన్న శ్రీగురురాజ ఇంగిలష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 7వ జిల్లాస్థాయి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి త్రోబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లా నలుమూలల నుంచి 108 బృందాలు పాల్గొన్నాయి బాలికల విభాగంలో ప్రథమ స్థానం గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ద్వితీయ స్థానం గుడ్‌షెప్పర్డ్ పాఠశాల, తృతీయ స్థానం కర్నూలు విజ్ఞాన పీఠం, బాలుర విభాగంలో ప్రథమ స్థానం గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల, ద్వితీయ స్థానం కర్నూలు విజ్ఞాన పీఠం, తృతీయ స్థానం భాగ్యనగరం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు విజేతలుగా నిలిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి తెలిపారు. గురురాజ ఇంగ్లీష్ మీడిఆయం పాఠశాల బాలుర బాలికల విభాగంలో విజేతలుగా నిలిచి డబుల్‌క్రౌన్ సాధించారన్నారు. బహుమతి ప్రధానోవానికి ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, చిన్నపురెడ్డి పాల్గొని ఫైనల్ మ్యాచ్ తిలకించి క్రీడాకారులకు ట్రోఫీని ప్రధానం చేశారు. బాలికల విభాగంలో బెస్ట్ ప్లేయర్ గుడ్‌షెప్పర్డ్ పాఠశాలకు చెందిన వర్షిణి, బాలుర విభాగంలో విజ్ఞాన పీటం సాయికుమార్ నిలిచారు. క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సంకల్పంతో ప్రతి సంవత్సరం మా తండ్రి గారి జ్ఞాపకార్థం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని దస్తగిరిరెడ్డి తెలిపారు. ఇదే ప్రతిభాపాటవాలు జాతీయ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా క్రీడా ప్రతినిధులు ఏపిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు, దివాకర్, శ్రీధర్, విష్ణు, బాలకృష్ణలు పాల్గొన్నారు. డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డిలు పాల్గొని వ్యాయామ ఉపాధ్యాయ బృందానికి జ్ఞాపికలను అందజేశారు.

### విజయవంతంగా ముగిసిన

# జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



విజయవంతంగా ముగిసిన వైద్య శిబిరం

**శిరువెళ్ల, మేజర్‌న్యూస్ః** శిరువెళ్ల మండల పరిధిలోని గోవిందపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాన్ని డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ దివ్య మరియు ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓపీఆర్‌డి నాగేంద్రుడు, పీహెచ్‌ఓ రాంమోహన్ రెడ్డి, శిరువెళ్ల మండల వైయస్ఆర్‌సీపీ కన్వీనర్ ఉండూరు ప్రతాప్ రెడ్డిలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్యులు అశోక్‌కుమార్ మరియు ఎముకల, కీళ్లవ్యాధి నిపుణులు సునిల్ మరియు కంటి వైద్యులు గంగాధర్ తదితరులు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన వైద్య శిభిరంలో సుమారు 551 మందిని స్పెషలిస్టు డాక్టర్లు పరిశీలించడం జరిగింది. ఇప్పటివరకు శిరువెళ్ల మండల పరిధిలోని 14 గ్రామాల్లో వైద్య శిబిరాలు జరిగాయని 6 గ్రామాలలో జగనన్న సురక్ష ప్రోగ్రామ్‌ను సుమారు 8వేల మంది పైగా ప్రజలు ఈ వైద్యసేవలను అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### నేడు టీడీపీ సమన్వయ

# కమిటీ సమావేశం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు బి.టి.నాయుడు, మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, కర్నూలు, నంద్యాల పార్లమెంటు టీడీపీ రాష్ట్ర ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

### మా కాలనీలో ఏర్పాటు చేసిన

# సెల్‌టవర్‌ను తొలగించాలి




వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర పాలక సంస్థ 35వ వార్డు పరిధిలోని ముదిరాజ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను వెంటనే తొలగించాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారని నగర కమిషనర్ భార్గవతేజ తెలిపారు. సోమవారం నగర పాలక కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అశోక్‌నగర్, సోమిశెట్టినగర్, కల్లూరు వంటి కాలనీల్లో నీటి సరఫరా సక్రమంగా లేదని, ఆ సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు కోరినట్లు తెలిపారు. అలాగే మారుతినగర్, గీతానగర్ లో ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని ఆ కాలనీ వాసులు కోరినట్లు తెలిపారు. గీతానగర్‌లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని, సమస్యను పరిష్కరించి ప్రజల ఇక్కట్లు తొలగించాలని కోరినట్లు తెలిపారు. అలాగే వీనస్ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆ కాలనీవాసులు తెలిపినట్లు చెప్పారు. స్పందనలో వచ్చిన అన్ని సమస్యలపై సంబంధితాధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వేణుగోపాల్, డీసీపీమోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి బస్సు యాత్ర విజయవంతం కావాలని, చంద్రబాబునాయుడు ఆరోగ్యం బాగుపడాలని సోమవారం ఎద్దులదొడ్డి గ్రామంలోని వీరభద్రస్వామి దేవాలయంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రాంపల్లి తిరుపాల్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నారాచంద్రబాబునాయుడపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాముల విజయ్, మాజీ సర్పంచ్ వీరేష్, టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, శ్రీనివాసగౌడ్, ముక్కెళ్ళ రామచంద్ర, మసాలా శ్రీను, అమినాబాదు మధుబాబు, వెంకట్‌రెడ్డి, శివరాముడు, చక్రపాణి, రాంపల్లి సుభాష్‌చంద్రబోస్, నల్లగొండ రవి పాల్గొన్నారు.

# ఘనంగా భరద్వాజ మాస్టర్ జయంతి వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల శ్రీ పోలికి వర చిదంబర స్వామి సన్నిధిలో శ్రీభరద్వాజ్ మాస్టర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన్నట్లు సంస్థాన్ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం పోలికి వర చిదంబర స్వామి, భరద్వాజమాస్టర్లకు ప్రత్యేక అభిషేకము, ప్రత్యేక అలంకరణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించామని, అదేవిధంగా విజయవాడకు చెందిన శ్రీనివాస్‌చే సత్సంగము, మధ్యాహ్న హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. స్వామి వారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# బొజ్జమ్మ సమక్షంలో వైకాపాలో చేరిన టిడిపి కుటుంబాలు



వైకాపాలో చేరిన టిడిపి కుటుంబాలు

**దేవనకొండ, మేజర్‌న్యూస్ :** దేవనకొండ మండల ఫరిదిలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన 25 టిడిపి మద్దతుదారుల కుటుంబాలు సోమవారం వైకాపా జిల్లా మహిళా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు సమక్షంలో జిల్లెడుబుడకల గ్రామం నందు వైకాపాలో చేరడం జరిగింది. బొజ్జమ్మ అందరికీ వైయస్సార్ పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించింది. ఈ సందర్భంగా బొజ్జమ్మ మట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులైన టిడిపి సానుభూతి పరులు వైకాపాలో చేరడం జరిగిందన్నారు. అదే విధంగా రానున్న ఎన్నికలలో జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించింది. పార్టీలో చేరిన వారిలో డి.భాస్కర్, తిరుపతమ్మ, జక్కల హరి, మద్దిలేటి, రామచంద్ర, బాల్ గంగాధర్, రంగముని, మారెప్ప, చిన్న రంగన్న, రంగడు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

### – బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

### – పురంధేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరిన యాదవ సంఘం నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. సోమవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో కర్నూలు నగరానికి చెందిన యాదవ సంఘం నాయకులు శ్రీరాములుయాదవ్, అతని అనుచరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు నరేంద్రమోడీ పాలన కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా సుపరిపాలన అందిస్తున్న ఏకైక ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. బీజేపీ బీసీలకు పెద్దపీట వేస్తుందని, వచ్చే ఎన్నికల్లో కర్నూలు జిల్లలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి బిట్ర వెంకటశివనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావుయాదవ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న దృశ్యం

సూర్య

మంగళవారం 31 | అక్టోబరు 2023

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**– జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్**



**వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్**

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి.

**వాటిలో కొన్ని ఫిర్యాదులు..!**

– కెనాల్ మరమ్మతులు చేయడానికి ప్రొద్దుటూరుకు చెందిన పుట్టా రమణయ్య అనే వ్యక్తి నా నాలుగెకరాల పొలంలో కాంక్రీట్ ప్లేట్, ఇసుక, కంకర వేసుకుంటానని మూడేళ్లు లీజు తీసుకొని సంవత్సరానికి రూ.35వేలు ఇస్తానని చెప్పి పూర్తయిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు ఫిర్యాదు చేశారు.

– ఎమ్మిగనూరుకు చెందిన ఇబ్రహీం మా పొలంలోని 70క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేశాడని ఎమ్మిగనూరుకు చెందిన సంధ్య ఫిర్యాదు చేశారు.

– నా పాన్‌కార్డు నెంబర్‌లో నాకు తెలియకుండా హైదరాబాద్‌లో తెలియని వ్యక్తి లోన్ యాప్‌లో రూ.34వేలు రుణం తీసుకొని నా ఫోటో, నా పేరును కూడా మార్పి చేసి లోన్ తీసుకున్నాడని లోన్ కట్టకుండా ఉండటంతో లోన్ ఇచ్చిన వాళ్లు నా పాన్‌నెంబర్ ఆధారంగా నాకు నోటీసులు ఇస్తూ, ఫోన్లు చేస్తున్నారని కర్నూలు గణేష్‌నగర్‌కు చెందిన కృష్ణ ఫిర్యాదు చేశారు.

– నా ఫోటో షాపు దగ్గరకు అప్పుడప్పుడు వస్తూ నన్ను పరిచయం చేసుకొని రహమ్‌తుల్లా, కృష్ణమోహన్, నాగరాజులు ఏపీ, తెలంగాణలో పెద్ద మొత్తంలో డ్బులు తీసుకొని ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశ చూపి నా నుంచి రూ.2.40లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు అబ్దుల్లాఖాన్‌ఎస్టేట్‌కు చెందిన మనోహర్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివా సులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు

**– న్యాయం చేయండని ఎస్పీకి బాధితుని ఫిర్యాదు**



**ఫిర్యాదుదారుని అర్జీని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ**

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్‌:** తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని 2016లో రాజు అనే వ్యక్తి రూ.3లక్షలు తీసుకొని మోసం చేశాడని, డబ్బులు అడిగితే కాలయాపన చేస్తూ బెదిరిస్తున్నాడని సుధాకర్ అనే వ్యక్తి నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఫిర్యాదు చేశాడు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 135 మంది ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదులను జిల్లా ఎస్పీకి అందించి న్యాయం చేయాలని కోరారు. బాధితుల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ బాధితులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కారం అయ్యే సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే కోటా వీధిలో వున్న తన ఇంటిని దౌర్జన్యంగా ఒక మహిళ ఆక్రమించుకుందని విజయన్న అనే వ్యక్తి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. గత సంవత్సరం శనగలు తీసుకొని శేషయ్య అనే కమీషన్ ఏజెంట్ శనగల తాలూకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని సంజామల మండలం పేరుసోముల గ్రామానికి చెందిన మాబుసా, బాలయ్యలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులకు చట్టపరిధిలో పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. స్పందనకు వచ్చిన ఫిర్యాదుదారులకు ఓంకారం దేవస్థానం వారు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బి డీఎస్పీ జేవీ సంతోష్, సీఐ సూర్యమౌళి, ఎస్‌ఐలు రాకేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

# సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



**వెన్నముక ఆపరేషన్‌కు అనిల్‌కుమార్‌కు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సామూన్**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్పందన సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందనలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పుల్లయ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వేగవంతంగా పరిష్కరించాలని చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్, నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత ఉత్సాహంతో పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఇక నుంచి ప్రతి సోమవారం రెండు డిపార్ట్‌మెంట్లు ప్రజలు అసంతృప్తి చెందిన అంశాలు రీ ఓపెన్ అయిన కేసులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని కలెక్టర్ తెలిఈపారు. చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ గైర్హాజరుపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆళ్ళగడ్డకు చెందిన అనిల్‌కుమార్ తాను కార్‌లో వెళ్తున్నప్పుడు రోడ్డు ప్రమాదం జరిగిందని ఆ సంఘటనలో తనవెన్నముక విరిగిందని ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని పెట్టుకొనే స్తోమత లేనందున గతనెల 19న డోన్‌కు ముఖ్యమంత్రి వచ్చినప్పుడు కలిసి మా పరిస్థితి వివరించామని ముఖ్యమంత్రి కలెక్టర్‌కు చెప్పగా తక్షణ సహాయం కింద రూ.లక్ష చెక్కును స్పందనలో అందజేశారు. 195 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

# నిరాహార దీక్షలకు సిద్ధంగా ఉన్నాం..

- సర్వేనెంబర్‌లో ఇళ్ళుఉన్నాయి.. ఆన్లైన్ నుండి తొలగించండి..
- ఇళ్లను అక్రమంగా ఆన్‌లైన్ చేసిన అధికారుల పై చర్యలు తీసుకోవాలి
- నివాసం ఉంటున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి..
- గతంలో అధికారుల దృష్టికి సమస్య..
- 50 రోజులైన ఇప్పటి వరకు సమస్య తీరలేదని బాధితుల ఆవేదన



**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని మిట్ట కందల గ్రామంలో ఉన్న 320 సర్వే నంబర్‌లో 60సంవత్సరాలు పైనే గృహాలు ఉండి 20 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. అయితే గతంలో ఉన్న అధికారులు నివాసమున్న ఇండ్లకు ఖాతా నంబర్ 452 విద్య పోగు అరుణమ్మ, ఖాతా నెంబర్ 489 ఎల్ రాజారత్నం అనే వ్యక్తుల పేర్ల పై ఆన్లైన్ చేసి పాస్ పుస్తకాలు జారీ చేశారని తాము ఉంటున్న ఇళ్లకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని, అధికారులు ఇతరులకు ఎలా ఆన్‌లైన్ ,చేస్తారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ విషయమై రెవెన్యూ అధికారులకు తప్పుగా ఆన్‌లైన్‌లో ఎక్కించిన ఇతరుల పేర్లు తొలగించాలని వినతిపత్రం అందించడం జరిగిందని, అధికారులకు వినతిపత్రం ఇచ్చి 50 రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు సమస్య తీరలేదని వినతిపత్రం అందించిన ప్రయోజనం లేకుండా పోయిందని బాధితులు వాపోతున్నారు. సర్వే నంబరు 320 ఆర్.ఎస్.ఆర్‌లో కేవలం 58 సెంట్లు ఉంటే అప్పట్లో ఉన్న అధికారులు మాత్రం ఏకంగా మూడు ఎకరాల 20 సెంట్లు ఆన్లైన్ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నామన్నారు.లేని పక్షంలో నిరాహార దీక్షలకు సిద్ధంగా ఉన్నామని బాధితులు హెచ్చరించారు. అనంతరం మరోసారి డిప్యూటీ ఎమ్మార్వో పటాన్ బాబుకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సమస్యను సూర్య దినపత్రిక ఇదివరకే ఇళ్లకు పాసుపుస్తకాలు అనే కథనంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్ళింది. వెంటనే దీనిపైన చర్యలు చేపడతామని అధికారులు కూడా చెప్పారు. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లిన ఇంత వరకు సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్థం. ఇదే విషయంపై డిప్యూటీ ఎమ్మార్వో పటాన్ బాబును వివరణ కోరగా ఉన్నత అధికారులకు నివేదిక పంపించామని నివేదికకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలాలి, కాజా, మసూమ్, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు రీ ఓపెన్ కాకూడదు– జిల్లా కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** జగనన్నకు చెబుదాం–స్పందన సమస్యలు రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకుచెబుదాం–స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం–స్పందకు సంబంధించి మండలాల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు జిల్లాస్థాయికి వస్తున్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే శాఖలకు సంబంధించిన అంశాలపై చాలా ఎక్కువ అర్జీలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారమవుతాయి అన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా రీ ఓపెన్ కేసులు కర్నూలు రూరల్, ఆస్పరి, మద్దికెర, ఆదోనిఅర్బన్, హలహర్వి, ఓర్వకల్లు తదితర మండలాల్లో ఎక్కువగా ఉన్నాయని,ఈ కేసులను సంబంధిత డివిజనల్ అధికారులు ప్రత్యేకంగా సమీక్షించాలని సూచించారు. వీటిలో ఎన్నికేసులు పరిష్కరించవచ్చు, ఎన్ని చేయలేము అని సమీక్షించి రీఓపెన్ కేసుల శాతం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని కార్యాలయాల భవనాల ఆధునీకరణ పనులను 3, 4నెలల్లోపు పూర్తి కావాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో వాహనలను ఎక్కడి పడితే అక్కడ కాకుండా ఒక క్రమపద్ధతిలో పార్క్ చేయాలన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే విజిటర్స్ వాహనాలకు సమాచార శాఖ కార్యాలయం ఆవరణలో పార్క్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకపపాలకు కలెక్టరేట్ వేదిక కాకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్**

# నేతల హామీలు ఏమైయ్యాయి..?

**పెద్దకడుబూరుమేజర్ న్యూస్ :**

పెద్దకడుబూరు మండల కేంద్రంలోని పెద్దకడుబూరు శాఖా గ్రంథాలయా భవనాన్ని 1978 వ సంవత్సరంలో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కుముద్దీబెన్ జోషితో పాటు మరి కొందరు నాయకులు ప్రారంభించారు. అయితే ఈ గ్రంథాలయం భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం వచ్చిందంటే భవనం వర్షానికి కారుతుంది. దీన్నీ దృష్టిలో ఉంచుకుని గతంలో జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు దాదాపు లక్ష రూపాయలు వరకు మంజూరు చేసినట్లు సమాచారం. అయితే ఇటీవల గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అనేక హామీలు ఇచ్చారు. కానీ ఇంత వరకు కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవని స్థానికులు, పాఠకులు, తీవ్రంగా విమర్శిస్తున్నారు. అలాగే భవనం లోపల నల్ల బండ పరుపుతో పాటు భవనం చుట్టూ నాపరాయి బండలు పాతించడానికి కూడా నేతలు హామీలు ఇచ్చారని అయిన ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడం విమర్శలకు దారితీస్తోంది.అదేవిధంగా గ్రంథాలయ భవనంకు ప్రహరీ గోడలు లేకపోవడంతో మందుబాబులకు నిలయంగా మారడమే కాకుండా కొందరు వ్యక్తులు మలవిసర్జనం చేయడంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మరింత ఇబ్బందికరంగా మారిందిని పాఠకులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రంథాలయ చైర్మన్, స్థానిక మండల నాయకులు జోక్యం చేసుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని పాఠకులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.




**పెద్దకడుబూరు శాఖ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకున్న దృశ్యం**